పల్లెల అభివృద్ధికి 'ఆర్థిక ' సహకారం

- గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగం
- సత్తెనపల్లి మండలానికి రూ.1.67 కోట్లు నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న సత్తెనపల్లి మండలంలోని సర్పంచ్‌లు

సత్తెనపల్లి: నాలుగున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో ఏ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదు సరికదా ! సరైన సౌకర్యాలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. గ్రామంలో ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండేవారు కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి గ్రామంలోనూ పది మందికి పైగా ప్రభుత్వ సిబ్బందిని నియమించి పల్లెల్లోనే సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. అంతే కాకుండా ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మొదట విడత నిధులను విడుదల చేశారు.


కొమెరపూడి సచివాలయ ముఖద్వారం

ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు ...

సత్తెనపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు గాను రూ.టైడ్ క్రింద 89,75,485, అన్‌టైడ్ క్రింద రూ.77,41,147 వెరశి రూ.1,67,16,632 పీడీ ఖాతాలకు జమకాను న్నాయి. అయితే పంచాయ తీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలోనే ఎప్పటికప్పుడు చెల్లింపులకు వీలుగా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ పోర్టల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో లావాదేవీల వివరాలు సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధి కారులకు తెలుస్తోంది. ప్రభుత్వ ట్రెజరీ అనుమతులు లేదా ఇతర ఉన్నతాధికారులు జోక్యం కూడా ఎక్కడా ఉండదని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధి కారులు వెల్ల డించారు.

ఖర్చు చేయాల్సిన విధి విధానాలు ..

పంచాయతీలకు జమ అయిన నిధులను టైడ్ అన్ టైడ్ భాగాలుగా విడగొట్టి మొదటి భాగంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ , అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. వీటితో పాటు శ్మశాన వాటికల అభివృద్ధికి కూడా వినియోగించుకోవచ్చు. ఈ పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడి భాగాలు కొనుగోలు చేసేందుకు కూడా వినియోగించుకోవచ్చు. రెండో భాగంలో ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు, చేతి పంపులు, నీటిట్యాంకులు, మోటార్ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీ సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు ...

గ్రామ పంచాయతీ	టైడ్ నిధులు (రూ.లక్షల్లో)	అన్‌టైడ్‌నిధులు (రూ.లక్షల్లో)
భట్లూరు	2,33,269	2,07,790
గండ్లూరు	69,751	62,196
గోగులపాడు	18,028	18,028
గుజ్జర్లపూడి	43,690	41,369
కట్టమూరు	4,51,555	3,96,681
పాకాలపాడు	4,07,674	3,58,955
రెంటపాళ్ళ	6,74,745	5,92,784
అబ్బూరు	5,15,957	4,55,071
భీమవరం	3,05,873	2,75,175
బృగుబండ	2,93,263	2,66,658
ధూళిపాళ్ల	5,36,315	4,82,131
గుడిపూడి	6,82,220	6,01,965
కందులవారిపాలెం	2,77,680	2,44,190
కంకణాలపల్లి	3,28,010	2,94,773
కంటెపూడి	1,82,960	1,19,030
కొమెరపూడి	6,97,595	6,17,302
లక్కరాజుగార్లపాడు	5,86,235	5,14,793
నందిగామ	7,72,526	6,84,108
పెద్దమక్కెన	4,10,887	3,62,520
పణిదం	6,81,075	5,99,655
గర్నెపూడి	1,66,450	1,02,338
దీపాలదిన్నెపాలెం	83,236	74,335
కట్టావారిపాలెం	2,83,932	1,70,944
లక్ష్మీపురం	1,59,986	96,321
గోరంట్ల	1,12,573	1,02,015
మొత్తం	89,75,485	77,41,147

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు



కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన రెండో విడత 15 ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల పీడీ ఖాతాలకు జమచేయనున్నాం. ఈ నిధులకు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. వివిధ అభివృద్ధి పనులకు ఉపయో గించిన నిధులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ పోర్టల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ బిల్లులపై ప్రభుత్వం ఏటా ఆడిట్ నిర్వహిస్తోంది. తప్పులు దొర్లితే సంబంధిత సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

–జి.వి.సత్యనారాయణ, ఎంపీడీఓ, సత్తెనపల్లి

క్లుప్తంగా

జోరుగా మిరపనాట్లు



అమరావతి : మిరపనారు ఏపుగా పెరగడంతో మండల పరిధి గ్రామాల్లో గత నాలుగు రోజులుగా రైతులు జోరుగా మిరపనాట్లు సాగిస్తున్నారు. నారుమళ్లలో పెరిగిన మిరపనారును చేలల్లో నాటే సమయం ఆసన్నమవడంతో మిరపనాట్లు నాటుతున్నారు. గత నాలుగు రోజులుగా మండల పరిదిలోని అన్ని గ్రామాల్లో అక్కడక్కడ వర్షం పడడంతో రైతులు మిరప నాట్లు ప్రారంభించారు. మిరపనాట్లకు పెద్ద ఎత్తున కూలీలు అవసరమవడంతో రైతులు పక్క గ్రామాల నుంచి కూలీలను తీసుకుని వచ్చి నాట్లు సాగిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో రైతులు గతేడాది ముడత తెగులు వల్ల నష్టపోవడంతో మిర్చి పంట తక్కువగా సాగు చేస్తున్నారు. గతేడాది మండలంలో నాలుగు వేల ఎకరాల్లో మిర్చిపంట సాగుచేస్తే ఈఏడాది మూడువేల ఎకరాల్లో సాగుఅవుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది దిగుబడి తగ్గినా గిట్టుబాటు ధరఉండడంతో రైతులకు ఉపశమనంగా ఉంది.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



75త్యాళ్లూరు(పెదకూరపాడు): ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపల్ నందమూరి శిరీషా తెలిపారు. ఆదివారం మండలంలోని 75 త్యాళ్లూరు వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ ఆవరణలో ఎంజె నాయుడు(ఆర్థో,కీళ్లు) సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి విజయవాడ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆసుపత్రి గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్ సారధ్యంలో స్పెషలిస్టు డాక్టర్ ఎంజెనాయుడు, డాక్టర్ రవితేజ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ జ్యోతి డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.500 మంది రోగులకు వైద్యసేవలు అందించినట్లు ఆసుపత్రి కోఆర్డినేటర్ తెలియజేశారు. కార్యక్రమంలో వీరబాబు, పి.రాఘవరాజు, స్థానిక నాయకులు హనిమిరెడ్డి, సాంబిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా శంకరరావు



సత్తెనపల్లి: భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షునిగా కందకట్ల శంకరరావు నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు ఆదివారం నియమక ఉత్తర్వులు అందించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కందకట్ల శంకరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్య నాయుడు, పల్నాడు జిల్లా సంయోజక్ పునుగుండ్ల రవిశంకర్, గుమ్మడి కోటేశ్వరరావు సత్తెనపల్లి నియోజకవర్గం కన్వీనర్ కట్టా శంకరరావు, గురజాల కన్వీనర్ అంబటి నవీన్ కుమార్, గంట విజయభాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను తాకిన సూర్యాస్తమయ కిరణాలు



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గా పీఠంలో దుర్గమ్మ అమ్మవారిని ఆదివారం సూర్యాస్తమయ సమయంలో కిరణాలు తాకాయి. శ్రావణ మాసంలో సూర్యాస్తమయ కిరణాలు తాకడం విశేషమని పీఠాధిపతి వెలిదండ్ల హనుమంతురావు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మాచవరం: పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యామర్తి హనుమయ్య (38) ఇటీవల సాగునీరు నిమిత్తం తన సొంత పొలంలో బోరుబావికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం పొలం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు.

బీటెక్ విద్యార్థినికి స్నేహహస్తాలు ల్యాప్‌టాప్ వితరణ


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎస్ఐ మణికృష్ణ

అచ్చంపేట: ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమతులు లేని ఎందరో విద్యార్థులు విద్యకు దూరంమవుతున్నారని, అలాంటివారిని స్నేహహస్తాలు ఫౌండేషన్ చేరదీసి వారి విద్యాభివృద్ధికి కావలసిన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ అన్నారు. స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన జెట్టి పూజిత ప్రాజెక్టువర్క్‌కు అవసరమయ్యే ల్యాప్‌టాప్‌ను ఆదివారం అచ్చంపేటలో ఎస్ఐ మణికృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ప్రాజెక్టువర్క్‌కు కావలసిన ల్యాబ్‌టాప్ కొనిపెట్టే ఆర్థిక స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు రూ.35000 విలువచేసే ల్యాప్‌టాప్ అందచేయడం హర్షణీయమన్నారు. విద్యాభివృద్ధికి వారు చేస్తున్న కృష్ణ అనిర్వచనీయమన్నారు. ప్రతిభకు విద్య తోడైతే వారి భవిష్యత్ ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మన్నెం భద్రయ్య, కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, కానిస్టేబుల్ సత్తిరాజు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి కమిటి చైర్మన్ తుమ్మా శౌరైడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణా అడ్వాన్స్ స్కానింగ్ సెంటర్ ప్రారంభం


స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చల్లంచర్ల సాంబశివరావు

సత్తెనపల్లి: ఆధునిక టెక్నాలజీతో స్కానింగ్ సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉండడం ఆనందకరమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. ఆదివారం సత్తెనపల్లిలోని సుజాత లక్ష్మీ వైద్యశాల పక్కన వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్‌తో కలసి శ్రీ కృష్ణా అడ్వాన్స్ స్కానింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ ఎంతో ఉపయోగమన్నారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ మానవుల శరీరంలోని వ్యాధి మూలాలను గుర్తించి, వారికి త్వరితగతిన వైద్యం అందేలా చేయడమే అల్ట్రా సౌండ్ స్కానింగ్ ముఖ్య ఉద్దేశమని, సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు ఎక్కువగా జీవనం సాగిస్తూ ఉంటారని, వారి అవసరాల నిమిత్తం ఈ స్కానింగ్ సెంటర్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. గుంటూరు నగరంలో ఏ విధమైన స్కానింగ్ సౌకర్యాలు ఉంటాయో వాటికి ఏ మాత్రం తగ్గకుండా డా. రాజ్యలక్ష్మీ స్కానింగ్, వైద్య సేవలు నిర్వహిస్తారని తెలిపారు. రేడియాలజీ డా. రాజ్యాలక్ష్మీ మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో అల్ట్రా సౌండ్ స్కానింగ్ లు తీయనున్నట్లు తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అల్ట్రా సౌండ్‌స్కానింగ్ ద్వారా పెనరొమిక్ వ్యూ, మైక్రో వ్యాస్కులర్, డాప్లర్ స్టడీస్ కు సంబంధించిన స్కానింగ్ లు స్పష్టంగా వస్తాయన్నారు. ఈ స్కానింగ్ సెంటర్ ద్వారా స్థానిక ప్రజలు మరిన్ని సేవలు వినియో గించుకోవాలని డా.రాజ్యలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో వంగా రాజగోపాల్ రెడ్డి ,డా.చిట్టెం లక్ష్మణ్, డా. కంఠా జగదీష్, తోట రంగారావు, గుడి సతీష్ కుమార్, పుల్లగుర చంద్రశేఖర్, కదిరి గణేష్, గాజుల సాయిరాం, గార్లపాటి ప్రభాకర్, బెల్లంకొండ నాగసాయి ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ పార్టీ అభ్యర్థులను బలపరుద్దాం

- రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు
- పెదకూరపాడు నియోజకవర్గ బీసీ కమిటీ ఎంపిక


పెదకూరపాడు నియోజకవర్గం బీసీ సంఘం నూతన కమిటీతో బీసీ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు

క్రోసూరు: 2024 ఎన్నికల్లో బీసీ పార్టీ అభ్యర్థులను బలపరిచి గెలిపించుకుందామని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఆదివారం క్రోసూరు షాదీఖానాలో ఏర్పాటు చేసిన బీసీ యువ గర్జన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బీసీ వాదిగా బీసీలను గౌరవించాలని, అభిమానించాలని, వారికోసం ప్రాణత్యాగానికైన సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. భవిష్యత్తుల్లో బీసీ పార్టీలను బలోపేతం చేయాలని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గంలో బీసీలను కొన్ని సంవత్సరాలుగా రాజకీయ బానిసలుగా వాడుకుంటున్నారని అన్నారు. పదవులిచ్చినా అధికారం లేకుండా చేస్తున్నారని అన్నారు. బీలకు వచ్చే సమస్యలను ఏ నాయకుడు పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని నిలబెట్టుకుని గెలిపించుకుందామన్నారు. రాష్ట్రంలో బీసీలు అధికంగా ఉన్నారని, ఏపార్టీ అయినా అసెంబ్లీకి బీసీలకు ఒకటి రెండు సీట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలే మా బలం అంటున్నారే కానీ బీసీలకు చేసిందేమి లేదన్నారు. వచ్చే ఎన్నికలో బీసీ నాయకులు పోటీ చేడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈసారి ముఖ్యమంత్రి పదవి బీసీలకు ఇస్తామని ఆయా పార్టీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సారి ఓటు మాకే సీటు మాకే అన్న నినాదంతో ఐకమత్యంగా ముందుకు సాగుదామన్నారు. అనంతరం నియోజకవర్గ బీసీ సంఘం కమిటీని ఎంపిక చేశా రు. నియోజకవర్గ అధ్యక్షుడుగా దాసరి తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు గుంజి వెంకట్రావు, యువజన అధ్యక్షుడు తూమాటి సైదులు, ప్రధాన కార్యదర్శి వడకండ్ల లక్ష్మణాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతపల్లి కోటయ్య, క్రోసూరు మండల అధ్యక్షుడుగా కోనంకి గురునాధం, యువజన అధ్యక్షులుగా మల్లాల రామాంజనేయులు, అచ్చంపేట యువజన అధ్యక్షుడు బత్తుల సూర్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో త్రైతా సిద్ధాంతం ప్రచారం

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగద్గీత గ్రంథాలను ప్రచారం చేయడం జరిగింది. శ్రావణ మాసంలో వచ్చే శ్రీకృష్ణజన్మాష్టమి పర్వదినం యొక్క అష్టమి తిధి జన్మరహస్యాన్ని తెలుసుకుంటే జ్ఞాన, అజ్ఞానాల వ్యత్యాసాలు తెలుస్తాయని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీతలోని పరమార్థాన్ని ప్రజలకు వివరించారు.

దేవరంపాడు ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రూ. 2.75 కోట్లతో అభివృద్ధి పనులు
- మంత్రి అంబటి రాంబాబు


దేవరంపాడు వద్ద శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిపనులు


ఆలయం వద్ద అభివృద్ధిపనులు పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: పల్నాడు ప్రాంతానికే తలమానికంగా భాసిల్లుతూ చిన్న తిరుమలగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్న దేవరంపాడు నేతివెంకన్నస్వామి ఆలయం అభివృద్ధి వేగవంతంగా పూర్తిచేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దేవరంపాడు గ్రామంలోని నేతివెంకన్న స్వామి ఆలయం ప్రాంగణంలో రూ.2.75 కోట్లతో చేపడుతున్న అభివృద్ధిపనులను ఆదివారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయశాఖ నుంచి రూ.1కోటి నిధులతో నిర్మాణమవుతున్న ముఖమండపం, రూ.25 లక్షలతో నిర్మితమవుతున్న మెట్ల మార్గం , జలవనరుశాఖ నిధులతో ఎన్నెస్పీకాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పరిశీలించినట్లు తెలిపారు. పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, తోట లక్ష్మీనారాయణ, యానాదియ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేపడుతున్న ఫౌండేషన్ సభ్యులు, దాతలు


నకరికల్లు: పేదలకు సేవ చేసేందుకు తమఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ షేక్.కరీమ్‌బాషా తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గల రాజీవ్‌గాంధీ మెమోరియల్ వికలాంగుల ఉన్నతపాఠశాలలో దీవన్‌సాధ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు పోలా వెంకటరమణ, వెంకటరామ శివ సత్యనారాయణ, భారవి, నాగప్రదీప్‌కుమార్‌ల సహకారంతో పాఠశాలలోని దివ్యాంగులైన పిల్లలకు అన్నదానం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దిరమేష్‌బాబు, రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి


దమ్మాలపాడులో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ముప్పాళ్ళ: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మండలంలోని దమ్మాలపాడు, ముప్పాళ్ళ, బొల్లవరం, గోళ్ళపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. ప్రతి రైతు తప్పనిసరిగా సాగు చేసిన పంట వివరాలను గ్రామంలోని వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా గాని, రెవెన్యూ సిబ్బంది ద్వారా గాని నమోదు చేసుకోవచ్చన్నారు. పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ విధానం వల్ల వాతావరణ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతింటే ప్రభుత్వం అందించే నష్టపరిహారం పొందవచ్చన్నారు. మార్కెట్‌లో పంటలకు గిట్టుబాటుధర లభించనప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తులను ప్రభుత్వం నిర్దేశించిన దరకు అమ్ముకోవచ్చన్నారు. కౌలు రైతులు కూడా కార్డు ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

లైన్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన లైన్స్‌క్లబ్ కమిటీ సభ్యులు

పిడుగురాళ్ల: లైన్స్ క్లబ్ (అక్షయ) మరింత సేవలను చేయాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఒక్కరికి ఏదో ఒక రకంగా సహాయం చేస్తూనే వస్తోందని, అలా సేవ చేయాలనే గుణం కూడా ఉండడం ఎంతో మంచిదని ఆయన తెలియజేశారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా గుండా నారాయణరావు, కార్యదర్శిగా అవుల జనార్ధనరావు, కోశాధికారిగా కోడూరి కాశి శంకర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం పట్టణంలోని సాయి వృద్ధాశ్రమానికి రూ. 50,000 నగదును, ఫ్యాన్లును బహూకరించారు. 30 మంది విద్యార్థులకు ప్యాడులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు హాజరయ్యారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31న సాయంత్రం 4.00 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. సమావేశానికి ఎక్స్ అఫిషీయోగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు హాజరుకానున్నట్లు తెలిపారు. అజెండాలోని అంశాల పై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని ఆయన కోరారు.

29న సరస్వతి శిశుమందిర్‌లో అష్టావధానం

సత్తెనపల్లి: స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ఈనెల 29న సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో అష్టావధానం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. అవగాహన సుధాకర, స్వర్ణకంకణ గ్రహీత, శతావధాని శ్రీమాన్ నారాయణ బాలసుబ్రమణ్యం హాజరవుతారన్నారు.

నేడు, రేపు జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా

సత్తెనపల్లి: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28, 29న జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా పడినట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. తిరిగి ఈనెల 30, 31న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు యధావిధిగా జరుగుతాయన్నారు.

వాహన చట్ట సవరణతో రవాణా సిబ్బందిపై పెనుభారాలు

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వాహన చట్ట సవరణతో మోటార్ వాహనాల డ్రైవర్ల పై భారం మోపాయని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. శివాజీ అన్నారు. చేయూత ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు పట్టణ మహాసభ స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎస్ సైదేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని, ఇన్సూరెన్స్ ప్రీమియం విపరీతంగా పెంచారని, రూ. 200 ఉన్న గ్రీన్ టాక్స్ రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రోడ్ టాక్స్ 30 శాతం పెంచారని, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచారని, చిన్న చిన్న పొరపాట్లకు కూడా భారీ మొత్తంలో పెనాల్టీలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా ఎం హరి పోతురాజు, అధ్యక్షులుగా నాలి రాజేంద్ర, కార్యదర్శిగా ఏ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ గా పోలయ్యతో కలిపి 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.